క్లుప్తంగా

శాకంబరిగా కనకదుర్గమ్మ



శాకంబరిగా దర్శనమిచ్చిన గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ సుమారు వెయ్యి కేజీల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని ఇండుగపల్లిలో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. గ్రామంలో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎ.కొత్తపల్లిలో...

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖమంత్రి దాడిశెట్టి రాజా పాల్గొంటారని ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు.

డిగ్రీ కళాశాల్లో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము శుక్రవారం వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే తుని, ప్రత్తిపాడు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గాలో విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పీజీ చేసేందుకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండడంతో ఎక్కువ మంది విద్యార్థులు చదువు ఆపేస్తున్నారన్నారు. డిగ్రీ కళాశాలలో పీజీ సెంటర్ ఉంటే ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి వస్తాయన్నారు.

అన్నసమారాధన

రౌతులపూడి: స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని గ్రామ యాదవ యువకులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఐదువేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

సామాజిక బహిష్కరణపై ఆర్డీఓ విచారణ



తిరుమలాయపాలెంలో విచారణ నిర్వహిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి విచారణ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, తదనంతరం తొలగింపు విషయంలో ఓ వర్గం వారిపై సామాజిక బహిష్కరణ జరిగిందన్న ఆరోపణలు తలెత్తాయి. ఇటీవల ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ సైతం రెండుసార్లు గ్రామంలో పర్యటించారు. సామాజిక బహిష్కరణ ఆరోపణలపై ఆర్డీఓ గ్రామంలో విచారణ నిర్వహించి దుకాణాల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురితో మాట్లాడి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఏలేశ్వరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు మైమూన అన్నారు. జనవిజ్ఞానవేదిక, మద్యపాన వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మైమూన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల సమాజంతో పాటు ఆరోగ్యం పాడవుతుందన్నారు తొలుత విద్యార్థులు సమాజాన్ని మేలుకొలుపే అంశాలపై నాటికలు ప్రదర్శించారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకే జగనన్న సురక్ష

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: గ్రామాల్లో ప్రజల అవసరాలను తీర్చడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శనివారం ఆయన స్వగ్రామం శంఖవరంలో విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి 100 శాతం సంతృప్తి స్థాయిలో పథకాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. జూలై 1 నుంచి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక టీమ్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఒక టీమ్ ప్రతిరోజూ రెండు సచివాలయాల్లో క్యాంప్‌లు నిర్వహిస్తాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్ర లచ్చబాబు, అడపా వీరబాబు, బైరా శ్రీరామమూర్తి, నడిగట్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఏలేశ్వరం: జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు అన్నారు. మండలంలోని భద్రవరంలో గృహసారథులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలకు అర్హుల వివరాలను సేకరించారు.

ప్రత్తిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. గ్రామాల్లో శనివారం నుంచి నిర్వహించే జగనన్న సురక్ష ద్వారా అర్హులైన వారందరికీ 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఈఓఆర్డీ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా సర్వే

కోటనందూరు: మండలంలోని బిళ్లనందూరులో శుక్రవారం జగనన్న సురక్షపై సర్వే నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్, సర్పంచ్ బొత్స మంగ తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు నమోదు చేశారు.

పేదలకూ కార్పొరేట్‌కు వైద్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గెద్దనాపల్లిలో జీఎల్‌పీఎల్ యూనిట్‌కు శంకుస్థాపన



గెద్దనాపల్లిలో బీఎల్‌పీఎల్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: గ్రామాల్లోని పేద ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించటమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గెద్దనాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ లెవెల్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీఎల్‌పీఎల్ యూనిట్) నూతన భవనానికి శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షలు, స్కానింగ్‌ల కోసం పట్టణాల్లో ఉండే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లే పనిలేకుండా బీఎల్‌పీఎల్ యూనిట్‌లో అత్యాధునిక యంత్రాలతో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్, తోట గాంధీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సచివాలయాల మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, మొల్లేటి గంగాధర్, భూపాలపట్నం ప్రసాద్, తోట విష్ణు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- రెండేళ్లలో పట్టణంలో 80 రోడ్ల నిర్మాణం
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో తుని మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జాతరలా జరుగుతున్నాయన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 81 అంశాలను చర్చించి ఆమోదించారు. అనంతరం జీరో అవర్లో కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్, ఈవ్‌టీజింగ్, గంజాయి, జగనన్న సురక్ష, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు తహసీల్దార్ శివకుమార్, పట్టణ సీఐ నాగ దుర్గారావు, విద్యుత్, గృహ నిర్మాణశాఖలకు చెందిన అధికారులు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సుధారాణి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సుదపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన రెండేళ్ల కాలంలో పట్టణంలో 80 కొత్త రోడ్లను నిర్మించినట్టు వివరించారు. గత పాలకవర్గం సభ్యులు మున్సిపల్ ఆదాయాన్ని దోచుకున్నారని ఆరోపించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

శర్మకు ఘన సత్కారం

స్థానిక సీతారాంపురం మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేసిన శర్మ ఇటీవల స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. వీఆర్ తీసుకున్నా మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు సేవలు అందించాలని కోరారు.

వంతెన నిర్మాణంపై సర్వే

గోకవరం: స్థానిక ఠాణా సెంటర్‌లో ఊర కాలువపై నూతన వంతెన నిర్మాణానికి శుక్రవారం ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. 516–ఇ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ పాత వంతెన స్థానంలో రూ.10 కోట్లతో నూతనంగా వంతెన నిర్మించడానికి ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దీనిలో భాగంగా ఆర్అండ్‌బీ జేఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థల సేకరణ నిమిత్తం సర్వే నిర్వహించారు.

నిర్ణీత సమయంలో పౌష్టికాహారం అందించాలి



ఎ.మల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి

రౌతులపూడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిర్ణీత సమయంలో పౌష్టికాహారం అందించాలని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని ఎస్.పైడిపాల, మల్లంపేట, ఎ.మల్లవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని ఎప్పటికపుడు అందించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. రక్తహీనత గల చిన్నారులు, గర్భిణులను గుర్తించి వైద్యుల సహాయంతో సరైన సూచనలు ఇవ్వాలన్నారు. ఎస్.పైడిపాల అంగన్‌వాడీ కేంద్రానికి నాడు–నేడు పథకంలో రూ.5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఎ.మల్లవరం–3 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకీలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చేపూరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

తుని రూరల్: మండలంలోని చేపూరు సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు చెక్ పవర్‌పై నిషేధం విధించినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 14 ఆర్థిక సంఘం నిధులు, 15 ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిషేధం కొనసాగుతుందన్నారు. సాధారణ, 14వ, 15వ ఆర్థిక సంఘాల నిధులు వినియోగ అధికారం పీఆర్అండ్ ఆర్డీ (తుని మండల విస్తరణ అధికారి)కి అప్పగిస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీఓ వివరించారు.

కల్వర్టు నిర్మాణానికి సహకరించండి

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గంలో కల్వర్టు శిథిలమైంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నూతన కల్వర్టు నిర్మాణానికి సహకరించాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబును శుక్రవారం స్థానికులు కోరారు. ఈ మేరకు శిథిలావస్థలో ఉన్న కల్వర్టును ఎంపీపీ పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సరికాదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

జగ్గంపేట: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.అచ్చెన్నాయుడు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై చేసిన వ్యాఖలను ఆ పార్టీ నేత, ఉభయగోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇంచార్జి జాన్‌వెస్లీ ఖండించారు. జగ్గంపేటలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను అచ్చెంనాయుడు బైబిల్ అనడం సరికాదన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మానిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే 90 శాతానికి పైగా అమలు చేసిన సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించడం చూసి టీడీపీ నేతలు తట్టుకోలేక ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా సెక్రటరీ ఎస్.విజయరాజ్, జగ్గంపేట అధ్యక్షుడు రాజారత్నం, మైనార్టీ సెల్ నేతలు మర్రి పృధ్వీరాజ్, వసంత కుమార్ పాల్గొన్నారు.

మిగిలిన సత్రం భూములకు వేలం నిర్వహించాలి

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో వేలం నిర్వహించని 15.50 ఎకరాల భూమికి వెంటనే బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఇటీవల సుందర్శ సత్రం భూములకు కౌలువేలం నిర్వహించడంపై శుక్రవారం గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ భూస్వాముల నుంచి విముక్తి కల్పించి, సత్రం భూములను పేదలు కౌలుకు చేసుకోవడానికి కృషి చేసి సంఘం సభ్యులను అభినందించారు. ఈ సత్రం భూముల్లో ఇంకా 15.50 ఎకరాల భూమికి వేలం నిర్వహించాల్సి ఉందని, తక్షణమే ఈ భూములకు వేలం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, సహాయ కార్యదర్శి కడితి సతీష్, జిల్లా నాయకులు మడికి సత్యం, దేశెట్టి సురేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ మంగక్క, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పని చేయాలని ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, విద్య, నీటిపారుదల తదితర శాఖల ప్రగతిపై ఎంపీపీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పర్వత రాజబాబు మాట్లాడుతూ గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పంచాయతీలకు నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకట రమణ, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

తుని: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్టు తుని డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారన్నారు. తుని నుంచి ఎస్.పైడిపాలకు బస్సు సర్వీసు నడపాలని గొల్లు వెంకటరమణ, కారేపల్లి రామకృష్ణ, తుని నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, సామర్లకోట మీదుగా కాకినాడకు బస్సు నడపాలని సుబ్రహ్మణ్యం, శ్రీనివాసా సెంటర్ నుంచి తుని రైల్వేగేటు వరకూ వెళుతున్న బస్సులు వేగంగా నడుపుతున్నారని వెంకట స్వామి, తుని నుంచి పిఠాపురం, సామర్లకోటకు రైలు లింక్ సర్వీసు ఏర్పాటు చేయాలని వీరబాబు, విద్యార్థులు, ఉద్యోగుల కోసం రాత్రి సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు తుని డిపోలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లలిత్ కోరినట్టు ఆయన వివరించారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడి చేసి సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడిలో సారా విక్రయిస్తున్న ప్రత్తిపాడు గ్రామానికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని అత నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో 5 లీటర్ల సారాతో సోంబట్టుల లోవరాజును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముగ్గురు బైండోవర్

వివిధ సారా కేసుల్లో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను శుక్రవారం బైండోవర్ చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో కొట పద్దరాజును, పెద్దిపాలెంలో కాండ్రేగుల కృష్ణ, ప్రత్తిపాడులో రాయదుర్గ ప్రసాద్‌పై బైండోవర్ కేసు నమోదు చేసి ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ముందు హాజరు పరిచినట్టు తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని వెంగయ్యమ్మపురంలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వెంగయ్యమ్మపురంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన దశరధి ఆంజనేయులును అరెస్టు చేశారు. అతని నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

పోలీసులతో ప్రజలు మమేకం కావాలి

కిర్లంపూడి: పోలీసులతో ప్రజలు మమేకం కావాలని ఎస్సై టి.రఘునాథరావు అన్నారు. మండలంలోని తామరాడలో సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సారా, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైన మత్తు పదార్థాలు అమ్మినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలో ఈ నెల 2న నిర్వహించే టీడీపీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. గోకవరంలో శుక్రవారం టీడీపీ మండల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని నెహ్రూ ఆరోపించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.